క్లుప్తంగా

ఆధార్ మార్పు, చేర్పులకు అవకాశం

చిలకలూరిపేట: ఆధార్ కార్డులో మార్పు,చేర్పులకు అవకాశం కల్పిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు శనివారం తెలిపారు. ప్రస్తుతం 0–18 సంవత్సరాల లోపు వారు కొత్త ఆధార్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే డాక్యుమెంట్ అప్డేషన్, బయో మెట్రిక్ అప్‌డేషన్, అడ్రస్, జిల్లా మార్పువంటి ఆధార సంబంధిత సేవలు ప్రభుత్వం నిర్దేశించిన రుసుం చెల్లించి మార్పు చేసుకోవచ్చన్నారు. దీనికోసం పట్టణంలోని నాలుగు వార్డు సచివాలయాలు ఎంపిక చేసినట్లు తెలిపారు. పురుషోత్తమపట్నం, తహసీల్దార్ ఆఫీస్, సుబ్బయ్యతోట, వేలూరు రోడ్డులోని సచివాలయాలలో ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

సాంఘిక నాటకాల కమిటీ అధ్యక్షుడిగా అమృతపూడి



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ సాంఘిక నాటకాల నూతన కమిటీ అధ్యక్షుడిగా అమృతపూడి సాల్మన్‌రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొత్తపేటలోని వినుకొండ డైరెక్టర్ అండ్ డాన్స్ మాస్టర్స్ అసోసియేషన్, గుర్రంజాషువా కళానికేతన్ కళాకారుల సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో సాల్మన్ రాజును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసి కళాకారుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు పి.ఐ.కుమార్, పెద్దింటి కోటేశ్వరరావు, ఇజ్రాయిల్, నరసింహారావు, కారుమంచి కోటేశ్వరరావు, భవనాసి వెంకట్రావు, రామకోటయ్య, పిచ్చయ్య, సైకిలాబ్, ప్రభుదాసు, బాబు, తిరుపతిరావు, సుధీర్, వంగల ఇజ్రాయేలు పాల్గొన్నారు.

చదరంగం పోటీలతో మానసిక ఉల్లాసం



చిలకలూరిపేట: చెస్ పోటీలతో మానసిక ఉల్లాసంతో పాటు, తెలివితేటలకు పదును పెట్టవచ్చని ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి చెప్పారు. ఏఎంజీ హైస్కూల్‌లో ఇంటర్నేషనల్ చెస్ డేను పురస్కరించుకుని శనివారం చదరంగం పోటీలు నిర్వహించారు.పోటీలను ప్రారంభించిన డైరెక్టర్ మాట్లాడుతూ చెస్ ద్వారా ఎంతో మంది జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా పేరు ప్రఖ్యాతులు సాధించారని తెలిపారు. విద్యార్థులు చెస్ పట్ల ఆసక్తి పెంచుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు కృషి చేయాలన్నారు. చెస్‌తో గుర్తింపుతో పాటు పేరు ప్రఖ్యాతులు లభిస్తాయని వెల్లడించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం కె.కృపాదానం, వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, రాజేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోరాటయోధుడు సీఆర్

చిలకలూరిపేట: కార్మిక,కర్షక ప్రజా సమస్యల కోసం అహర్నిశలు పాటు పడిన పోరాటయోధుడు సీఆర్ మోహన్ అని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎ.మారుతీవరప్రసాద్ చెప్పారు. సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు సీఆర్ మోహన్ సంస్మరణ సభను శనివారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా ఎన్‌ఆర్‌టీ సెంటర్‌లో ఉన్న సీఆర్ స్మారక స్థూపం వద్ద నివాళులు అర్పించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి నాగబైరు రామసుబ్బాయమ్మ, నాయకులు కాసా రాంబాబు, పేలూరి రామారావు, ఆరాధ్యుల రామకృష్ణ, బొంతా భగత్‌సింగ్, అంజయ్య, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

నీలగంగవరంలో వరిగడ్డి వాములు దగ్ధం

వినుకొండ(నూజెండ్ల): గుర్తుతెలియని వ్యక్తులు వరిగడ్డి వామికి నిప్పంటించడంతో రెండు వరిగడ్డి వాములు పూర్తిగా దగ్ధమైన సంఘటన వినుకొండ రూరల్ మండలం నీలగంగవరం గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. గ్రామసర్పంచ్ కోటపాటి వన్నూర్ రెడ్డికి చెందిన రెండు వరిగడ్డి వాములను గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పూర్తిగా దహనమయ్యాయి. రూ.80 వేలు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు.

వాల్మీకి బోయసంఘం జిల్లా యూత్ అధ్యక్షుడిగా కోటేశ్వరరావు



యడ్లపాడు: మండల కేంద్రానికి చెందిన మల్లా కోటేశ్వరరావు ఏపీ వాల్మీకి బోయ సంఘం పల్నాడు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జక్కుల శ్రీనివాసరావు ఈ నియామక పత్రాన్ని పంపించినట్లు కోటేశ్వరరావు తెలిపారు. తన నియామకానికి సహకరించిన సంఘం రాష్ట్ర అధ్యక్షులు విక్రమ్ నాయుడు, కార్యదర్శి క్రాంతినాయుడుతో పాటు కమిటీ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. వాల్మీకి బోయలైన యువతను చైతన్యం చేసి తమ హక్కుల సాధనకై కృషి చేస్తానన్నారు.

బడుగు వ్యాపారులపైనా మీ ప్రతాపం?

- కూరగాయల దుకాణాల తొలగింపుపై సీపీఐ కన్నెర్ర
- అధికారులపై తీరుపై నాయకుల ఆగ్రహం



తొలగించిన కూరగాయల దుకాణ సామాను

నరసరావుపేట: పట్టణంలోని స్టేషన్ రోడ్డులో గల కాసు బ్రహ్మానందరెడి (కేబీఆర్) కాంప్లెక్స్‌లో కూరగాయలు అమ్ముకుంటున్న పేదలపై మున్సిపల్ అధికారులు జులుం ప్రదర్శించడాన్ని సీపీఐ నాయకులు తీవ్రంగా ఖండించారు. శనివారం సాయంత్రం కాంప్లెక్స్ వద్ద తొలగించిన కూరగాయల షాపులను జిల్లా కార్యదర్శి కాసా రాంబాబు, పట్టణ కార్యదర్శి వైదన వెంకట్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంప్లెక్స్ ఆక్రమించుకున్న పెద్దల జోలికి పోకుండా చిరు వ్యాపారాలు చేసుకునే వారిపైన దాష్టీకాన్ని ప్రదర్శించడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు.
సొంతంగా కొట్లు కట్టుకొని వ్యాపారాలు చేసుకుంటున్న పెద్దపెద్ద వాళ్లని ఏమనకుండా చిన్నచిన్న వ్యాపారస్తులపై చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. కాంప్లెక్స్ మొత్తం ఆక్రమించుకొని వ్యాపారాలు చేసుకుంటున్నా పట్టించుకునే నాథుడే ఇక్కడ లేడన్నారు.
ఖాళీగా ఉన్న 23 షాపులలో అసాంఘిక కార్యక్రమాలు ఇష్టానుసారంగా జరుగుతున్నాయని, వాటిలో మద్యం, గంజాయి, గుట్కాలు, పాన్ పరాగ్, పేకాట ఆడుతున్నా పట్టించుకోని అధికారులు కూరగాయలు అమ్ముకుంటూ జీవించే వారిపై మాత్రం దాష్టీకాన్ని ప్రదర్శించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేబీఆర్ ఆక్రమించుకున్న ఆక్రమదారులపై చర్యలు తీసుకోవాలని, కూరగాయలు అమ్ముకొని జీవిస్తున్న నిరుపేద వ్యాపారులను యథావిధిగా వ్యాపారాలు చేసుకోనీయాలని సూచించారు. వారి భయభ్రాంతులకు గురి చేయటం ఏ మాత్రం భావ్యం కాదన్నారు. తక్షణమే బాధితులకు న్యాయం చేయాలని, లేని పక్షంలో సీపీఐ తరపున బాధ్యత తీసుకొని ధర్నా చేస్తామని హెచ్చరించారు. నాయకులు ఉప్పలపాటి రంగయ్య, బాధితులు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న విజయభాస్కరరెడ్డి

నాదెండ్ల: మండలంలోని తూబాడు అంగన్‌వాడీ–2 కేంద్రాన్ని, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మండల ప్రత్యేకాధికారి ఎం.విజయభాస్కర్‌రెడ్డి తనిఖీ చేశారు. అంగన్‌వాడీ సెంటర్లో ప్రతిరోజు ఎంత మంది విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని వినియోగించుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు రక్తహీనత, ఎత్తుకు తగ్గ బరువు ఉన్నారో లేదో తూకం వేసి చూశారు. అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలు పరిశీలించారు. ప్రాథమిక పాఠశాల సమీపంలోని బావిని పరిశీలించి నీటి నాణ్యతను పరీక్షించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణపై కార్మికులకు పలు సూచనలు చేశారు. చిన్నారులకు వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు వహించాలని ఆదేశించారు. జ్వరాలు, సీజనల్ వ్యాధులు సోకితే తక్షణమే ఏఎన్‌ఎంల ద్వారా సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించాలన్నారు. ఆయన వెంట కార్యదర్శి జంగు జరీనా ఉన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలనివ్వకండి

గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పనిచేయాలని జిల్లా గ్రామ పంచాయతీల అధికారి, మండల ప్రత్యేకాధికారి ఎం.విజయభాస్కరరెడ్డి చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుతం గ్రామాల్లో డయేరియా, మలేరియా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.
గ్రామ పంచాయతీలు కుళాయి ద్వారా విడుదల చేసే తాగునీరు కూడా ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించాలన్నారు. ప్రతి వారంలో శుక్రవారం డ్రై డేగా పాటించాలన్నారు. దోమల నియంత్రణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

కేజీబీవీలో విద్యార్థులకు అవగాహన

బొల్లాపల్లి: ప్రస్తుతం వర్షాకాలంలో ప్రబలే అంటువ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని బొల్లాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పి.శంకర్‌నారాయణ తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి ద్వారా, కీటక జనిత ద్వారా పలు రకాల వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. వీటి పట్ల కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కీటక జనిత ద్వారా డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా, మెదడు వాపు వ్యాధులు ప్రబలుతాయని, తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉండటం వలన లార్వా వ్యాప్తి చెంది అంటువ్యాధులు ప్రబలుతాయన్నారు. డయేరియాపై సూచనలు చేశారు. భోజనానికి ముందు, అనంతరం చేతులు శుభ్రపరచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని, ఈగలు, దోమలు, పలు రకాల కీటకాలు వాలిన పదార్థాలు, బహిరంగ ప్రదేశాల్లోని ఆహార పదార్థాలను భుజించరాదని, పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు.
వారంలో శుక్ర, శని, ఆది మూడు రోజుల పాటు పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై వైద్యసిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి తగు జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆయా సబ్ సెంటర్ల పరిధిలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా గ్రామస్తులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో మంచినీటి చెరువులు నింపేందుకు చర్యలు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్ గోవిందరావు, డీఈఈ వెంకట రమణ

చిలకలూరిపేట: మంచినీటి చెరువులను సకాలంలో నింపేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు తెలిపారు. పట్టణానికి మంచినీటిని సరఫరా చేసే చెరువులకు సాగర్ జలాలు చేరనున్న నేపథ్యంలో శనివారం ఇంజనీరింగ్ అధికారులతో కలసి చెరువుల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు వృథా కాకుండా రాపిడ్ ఫిల్లింగ్ కోసం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. దీని నిమిత్తం ఎలక్ట్రికల్ మోటార్లు, డీజిల్ ఇంజన్లు, తూముల వద్ద ఇసుక బస్తాలు ఏర్పాటు చేశామన్నారు. మంచినీటిని ఇతర అవసరాలకు ఉపయోగించుకుండా కాల్వపై కాపలా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ తోట వెంకటరమణ, ఏఈఈ చల్లా శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

నిండుగా గాడిదల వాగు



మండల కేంద్రమైన రొంపిచర్లలో శనివారం ఉదయానికి 15.6 ఎం.ఎం వర్షపాతం నమోదు అయిందని తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. అలాగే గాడిదల వాగు నిండుగా నీరుచేరి కనిపించింది. వర్షం కారణంగా గ్రామాలు అన్ని చిత్తడి చిత్తడిగా మారాయి. గ్రావెల్ రోడ్లు అన్ని బురదమయం అయ్యాయి. వర్షంతో వాగుల్లో వంకల్లో జల ప్రవాహం ప్రారంభమైంది. ఎడతెరిపి లేకుండా చిరు జల్లులు పడుతుండటంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు, ఉద్యోగులకు కొంత మేర అసౌకర్యం కలిగింది. రైతులు, రైతు కూలీలు గృహాలకే పరిమితమయ్యారు.

–రొంపిచర్ల

నేడు గురుపౌర్ణమి

యడ్లపాడు: గురుపౌర్ణమి సందర్భంగా మండలంలోని షిర్డీ సాయిబాబా ఆలయాలు ముస్తాబయ్యాయి. లింగారావుపాలెం, కొత్తసాలస, సందెపూడి, బోయపాలెం గ్రామాల్లో గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఆయా ఆలయాల్లో వివిధ రకాల అభిషేకాలు, విశిష్ట అలంకరణలు, సామూహిక పారాయణలు నిర్వహించేందుకు ధర్మకర్తలు సర్వం సిద్ధం చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలతో పాటు పలు రకాల ప్రసాదాలు, కొన్ని మందిరాల్లో అన్న ప్రసాదాల పంపిణీకి సన్నాహాలు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారం కోసం హాస్టల్ నిద్ర

చిలకలూరిపేట: ప్రభుత్వ హాస్టల్ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నేటి నుంచి ఈ నెల 30వ తేదీ వరకు ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో హాస్టల్ నిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘ నియోజకవర్గ కార్యదర్శి మేకపోతుల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ హాస్టళ్లను సందర్శించి, అక్కడి సమస్యలు తెలుసుకొని సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలు తీసుకువెళ్లి పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కొత్తపట్నం గోపి, దాసరి హేమంత్, అన్నం శ్రీనివాస్, గుడిపల్లి జగదీష్, కంచర్ల సన్ని పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌కు గాయాలు

నాదెండ్ల: రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్‌కు గాయాలైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బాపట్ల జిల్లా చిన్నగంజాంకు చెందిన తుమ్మలగుంట శ్రీనివాసరావు మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తుంటాడు. ప్రస్తుతం అనారోగ్య కారణంగా మెడికల్ లీవ్‌లో ఉన్నాడు. శుక్రవారం నరసరావుపేటలో నివాసం ఉండే తన కుమారుడి ఇంటికి కారులో వచ్చాడు. తిరిగి ఉదయం 9 గంటలకు నరసరావుపేట నుంచి గుంటూరులో వైద్యం చేయించుకునేందుకు వెళ్తుండగా నుదురుపాడు రైల్వేస్టేషన్ సమీపం వద్ద గుంటూరు–నరసరావుపేటకు వెళ్తున్న ట్యాంకర్ ఢీకొంది. దీంతో శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలుకాగా స్థానికులు 108 సాయంతో నరసరావుపేట ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బ్యాంక్ ఆఫ్ బరోడాలో సేవలు విస్తృతం

నాదెండ్ల: వ్యవసాయ, విద్య, గృహ, బంగారు ఆభరణాలపై లోన్లు త్వరితగతిన తక్కువ వడ్డీతో అందిస్తున్నట్లు బ్యాంక్ ఆఫ్ బరోడా, గణపవరం బ్రాంచి మేనేజర్ పి.జయకర్ చెప్పారు. సీఆర్ కళాశాల ఆవరణలో ఉన్న బ్యాంక్ బ్రాంచిలో శనివారం బ్యాంకు 117వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. బ్యాంకు వ్యవస్థాపకుడు మహరాజ సాయాజీరావ్ గైక్వాడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులకు స్వీట్లు పంపిణీ చేశారు. సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ బ్యాంకులన్నింటి కన్నా తమ బ్యాంకులో బంగారు ఆభరణాలకు 74 పైసలు (8.9 శాతం), గృహ రుణాలకు 8.4 శాతం మాత్రమే వడ్డీ వసూలు చేస్తున్నట్లు తెలిపారు. కారులోన్లు, వ్యాపార, ముద్రా లోన్లు అందిస్తున్నట్లు తెలిపారు. విదేశీ విద్య కోసం సైతం రుణాలు అందిస్తున్నామన్నారు. వ్యవసాయ రుణాలు ఎకరాకు లక్షనుంచి పంటను బట్టి రూ.1.5 లక్షల వరకూ ఇస్తున్నామన్నారు. గణపవరంలో 2011లో ప్రారంభమైన బ్యాంకు శాఖ గడిచిన పదమూడేళ్లలో ప్రభుత్వానికి సంబంధించిన అన్ని పథకాలతో పాటూ రైతులకు రుణాలిస్తూ సేవలందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాయింట్ మేనేజర్ నాగయ్య, క్రెడిట్ ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు పతకాలు



నరసరావుపేట రూరల్: బాపట్ల సూర్యలంకలోని ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో ఈనెల 10 నుంచి 19వ తేదీ వరకు జరిగిన ఐదు జిల్లాల ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో ఎన్‌ఈసీ కళాశాల క్యాడెట్స్ ప్రతిభ కనబర్చి బహుమతులు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. సీనియర్ కేటగిరిలో ఎంవీ సుస్వంత్, జి.చిన్మయి, కె.కావేరి గోల్డ్‌మెడల్స్, ఫోటోగ్రఫీలో యు.ముత్తయ్య, ఫ్లాగ్ ఏరియాలో సి.హెచ్ చిరంజీవి, షేక్ అఫ్రీన్ నేహా, బీవీ రాణి గోల్డ్‌మెడల్స్, మహిళల ఫైరింగ్ విభాగంలో కె.గాంధీకుమారి(గోల్డ్‌మెడల్), జి.కావ్య (సిల్వర్ మెడల్) సాధించినట్టు వివరించారు. శిక్షణా శిబిరంలో అన్ని విభాగాల్లో ఉత్తమ ప్రదర్శన కనబర్చినందుకు ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను ఎన్‌ఈసీ కళాశాల కైవసం చేసుకున్నట్టు తెలిపారు. పతకాలు సాధించిన క్యాడెట్స్‌ను కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీల్, అధ్యాపకులు అభినందించారు.

లోతట్టు ప్రాంతాలపై దృష్టి పెట్టండి

- జలమయం కాకుండా చూడండి
- ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



నకరికల్లు స్టోరేజ్ ట్యాంకుకు వస్తున్న తాగు నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట: గత రెండురోజులుగా పడుతున్న వర్షాలకు లోతట్టు కాలనీలు, ప్రాంతాల ప్రజలు ఎటువంటి ఇబ్బంది పడకుండా కాలువల్లో పూర్తిస్థాయిలో పూడికలు తీయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అధికారులకు సూచించారు. శనివారం సత్తెనపల్లి రోడ్డులోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియం పక్కగా ఉన్న స్ట్రాం వాటర్ డ్రెయిన్‌లో జేసీబీతో పూడిక తీస్తున్న పనులను మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం నకరికల్లు వెళ్లి పట్టణ ప్రజల తాగునీటి అవసరాలకోసం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు నాగార్జునసాగర్ కెనాల్ నుంచి వస్తున్న నీటిని పరిశీలించారు. చెరువు నీటి సామర్థ్యం, పట్టణానికి ఎన్ని టీఎంసీల నీరు అవసరం, పూర్తిస్థాయి చెరువు నిండేందుకు ఎంత నీరు అవసరం, ఎన్ని రోజులు సమయం పట్టొచ్చు అనే విషయాలను అధికారులు ఆయనకు వివరించారు. మున్సిపల్ కమిషనర్ సి.రామచంద్రారెడ్డి, ఎం.ఇ కనకారావు, డీఇ ఓలేటి శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఇంజినీరు నాయక్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాయి మందిరంలో కుంభాభిషేకం

నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లిరోడ్డులోని శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో శనివారం నిర్వహించిన కుంభాభిషేకంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొన్నారు. మందిరం గోపురానికి ఏర్పాటు చేసిన కలశానికి ప్రత్యేక పూజలు నిర్వహించి కుంభాభిషేకం జరిపారు. కార్యక్రమంలో బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ పరిశీలన

ఆర్టీసీ బస్టాండ్‌లో వర్షానికి ప్రయాణీకులు ఇబ్బంది పడకుండా చూడాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మున్సిపల్ అధికారులను కోరారు. తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాలకు బస్టాండ్ ఆవరణలో నీరు నిలిచి అవస్థలు పడుతున్నామంటూ ప్రజలు చేసిన ఫిర్యాదు మేరకు ఆయన మున్సిపల్ అధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. బస్టాండు పరిసరాల్లో పేరుకుపోయిన మురుగు, వర్షపు నీటిని తక్షణమే తరలించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మరుగుదొడ్లకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి, ఆర్టీసీ డీఎం బత్తుల వీరాస్వామి, టీడీపీ నాయకులు వేల్పుల సింహాద్రి యాదవ్, కొట్ట కిరణ్, క్రాంతి, నరసింహా రావు పాల్గొన్నారు.

108 గుండాలతో గురు గీతాహోమం

తరలివచ్చిన ఎన్ఆర్‌ఐలు, ఉభయ తెలుగు రాష్ట్రాల భక్తులు



గురు గీతాహోమంలో పాల్గొన్న ఐసీఎం కంపెనీ ఎండీ కామేపల్లి బ్రహ్మనాయుడు దంపతులు



మాట్లాడుతున్న చిలకలూరిపేట ఆధ్యాత్మిక జ్ఞాన పీఠ వ్యవస్థాపకులు దేవిశెట్టి మల్లికార్జునరావు

నాదెండ్ల: గురుగీతాహోమం నిర్వహించినట్లయితే విశ్వంలో సమస్త దేవతలు, గురువులను పూజించినట్లేనని, భగవంతుని అనుగ్రహానికి ప్రాప్తులౌతారని చిలకలూరిపేట ఆధ్యాత్మిక జ్ఞాన పీఠ వ్యవస్థాపకులు దేవిశెట్టి మల్లికార్జునరావు చెప్పారు. గణపవరం ఇడుపులపాడు కాటన్ మిల్సు ఆయిల్ డివిజన్ గోడౌన్‌లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ శ్రీ గురు గీతా హోమం నిర్వహించారు. 108 హోమగుండాలతో 151 రకాల విశేష హోమ ద్రవ్యాలతో సామూహిక హోమసహిత సంపూర్ణ హోమం జరిపారు. ప్రతి హోమ గుండం వద్ద ఒక కుటుంబ సభ్యులు పాల్గొని భక్తిశ్రద్ధలతో హోమ కార్యక్రమం పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాస మహర్షి రచించిన స్కంధ పురాణంలో గురువు మహత్యం తెలుపుతూ పార్వతీ దేవి కోరిక మేరకు పరమేశ్వరుడు శ్రీ గురుగీతా హోమం గురించి వివరించినట్లు తెలిపారు. ఈ హోమానికి ఎన్ఆర్ఐలతో పాటూ ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు తరలివచ్చారు. 35 ఏళ్ల క్రితం చిలకలూరిపేట ఆధ్యాత్మిక జ్ఞాన పీఠం ఏర్పాటు చేశామని, గత ఐదేళ్లుగా శ్రీ గురుగీతా హోమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికీ జ్ఞానపీఠంలో జూమ్‌యాప్ ద్వారా భక్తులకు అనేక ఆధ్యాత్మిక విషయాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ హోమంలో ఇడుపులపాడు కాటన్‌మిల్స్ ఎండీ కామేపల్లి బ్రహ్మనాయుడు దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమాలను నిర్వాహకులు కేతినేని శ్రీహరిరావు, ప్రవీణ్, అంకమ్మచౌదరి, రోటరీ క్లబ్ సభ్యులు, జ్ఞాన పీఠ అధ్యక్షుడు రావూరి అన్నపూర్ణ, కార్యదర్శి నల్లమల్లి పద్మజ, సభ్యులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

మోడల్ స్కూల్లో ప్రత్యేకాధికారి పరిశీలన



రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెంలో గల పీఎంశ్రీ పాఠశాల అయిన ఏపీ మోడల్ స్కూల్‌ను శనివారం మండల ప్రత్యేక అధికారి కె.సూర్యప్రకాష్ రెడ్డి పరిశీలించారు. పాఠశాలలోని తరగతి గదులను ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించే విధానాన్ని పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు. పాఠశాల నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. హాస్టల్ నిర్వహణ, పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకంలో వంటలు తయారీ, రుచులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అదే విధంగా గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను, అంగన్వాడీ కేంద్రాలను కూడా ఆయన సందర్శించారు. విద్యార్థుల హాజరు పట్టికను, రికార్డులను, ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం నుంచి అందే పౌష్టికాహారాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో–2 డి.బ్రహ్మేశ్వరరావు, ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.